ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.1 । కనిష్ఠం 28.5



కామారెడ్డి జిల్లా వార్తలు

5

ఆదివారం 21 జూలై 2024

లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా సంతోష్ నియామకం

కామారెడ్డి టౌన్, జూలై 20: టీపీసీసీ లీగల్‌సెల్ జాయింట్ కన్వీనర్‌గా పాక సంతోష్ నియామకం అయినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా పాక సంతోష్ మాట్లాడుతూ తనకు పార్టీ జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆదేశాల మేరకు పని చేస్తానని తెలిపారు.

విస్తారంగా వర్షాలు



బాన్సువాడలో కురుస్తున్న ముసురు వర్షం

- జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు
- ముసురుతో ఆరుతడి పంటలకు మేలు
- వారం రోజులుగా వానలు కురుస్తున్నా లోటు వర్షపాతమే
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- వరినాట్లు వేయడంలో రైతులు బిజీ బిజీ
- ప్రధాన ప్రాజెక్టులలోకి రాని వరద

కామారెడ్డి, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. శనివారం పొద్దంతా చిరుజల్లులు పడుతుండడంతో పాటు శనివారం రాత్రి నుంచి బాన్సువాడ, ఎల్లారెడ్డి మండలాల్లో వర్షాలు విస్తారంగా కురుయడంతో అటు అన్నదాతల్లో, ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. కురుస్తున్న వర్షాలు అన్నదాతల్లో భరోసాను నింపుతున్నాయి. ఈ ముసురు వర్షం ఆరుతడి పంటలకు ఎంతగానో మేలు చేకూర్చనుంది. మొన్నటి వరకు వరి నాట్లు వేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్న రైతులు వరిని సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నా లోటు వర్షపా తమే నమోదై ఉంది. భారీ వర్షాలు కురువాలని ప్రధాన ప్రాజెక్టులు చెరువుల్లోకి వరద తరలి రావాలని రైతులు ఆశిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

పంటల సాగుపై భరోసా

ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు ప్రయోజనకరంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు క్రమంగా పెరుగుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. కురుస్తున్న వర్షాలు పంటల సాగుపై భరోసా కల్పిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 5,14,686 ఎకరాల్లో పంటలు సాగవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 3,07,165 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గత పక్షం రోజుల కిందట వర్షాలు లేకపోవడంతో వరి సాగు చేయాలా వద్దా అనే దానిపై రైతులు తర్జన భర్జన పడుతూ వచ్చారు. వరి నాట్లు వేసేందుకు వెనకడుగు వేశారు. ఈ సీజన్‌లో 3,33,542 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 1,98,700 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నాట్లు జోరందుకోనున్నాయి.

ఆరుతడి పంటలకు మేలు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు వరితో పాటు ఆరుతడి పంటలను విస్తారంగానే సాగు చేస్తుంటారు. తొలకరి జల్లులు పడగానే ఆరుతడి పంటలైన సోయా, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము లాంటి పంటల విత్తనాలను విత్తుతుంటారు. అయితే సీజన్ మొదట్లో తొలకరి జల్లులు పడడంతో ఆరుతడి పంటలను విస్తారంగానే రైతులు సాగు చేశారు. పంటల సాగు తర్వాత వర్షాలు ముఖం చాటేశాయి. కనీసం చిరుజల్లులు కూడా లేకపోవడంతో వేసిన సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పు దినుసు పంటల విత్తనాలు సైతం మొలకెత్తలేని పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో అడపాదడపగా కురిసిన చిరుజల్లులు, ఇటీవల కురుస్తున్న ముసురు వర్షం ఈ ఆరుతడి పంటలకు ఎంతగానో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే సోయా 70,424 ఎకరాలు, పత్తి 24,521, మొక్కజొన్న 23,519, కందులు 13,794, మినుము, పెసర్లు 20 వేల ఎకరాలల్లో సాగవుతున్నాయి.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోటు వర్షపాతం నుంచి సాధారణ వర్షాపాతానికి చేరింది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 20.08 మి.మీల వర్షపాతం నమోదైంది. అయితే ఈ సీజన్‌లో అనుకున్నంత స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాస్త రైతులకు ఊరటనిస్తోంది. జిల్లాలో ఇప్పటికీ పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, పాల్వంచ మండలాల్లో సాధారణం కంటే లోటు వర్షపాతం నమోదైంది. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, భిక్కనూరు, రామారెడ్డి, డోంగ్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఒక నస్రూల్లాబాద్ మండలంలోనే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.



దోమకొండలో పంటను సాగు చేస్తున్న రైతులు



నాట్లు వేసిన దృశ్యం



పత్తి పంట సాగు..

సంక్లిష్టమైన ఆర్థిక సంక్షోభంలోనూ రుణమాఫీ



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి



ర్యాలీలో పాల్గొన్న షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ కార్యకర్తలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- భిక్కనూరులో రైతు రుణమాఫీ సంబరాలు
- బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ కార్యకర్తలు

భిక్కనూరు, జూలై 17: సంక్లిష్టమైన ఆర్థిక సంక్షోభంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భిక్కనూరు రైతువేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడు నెలలు అవుతుందన్నారు. ఈ ఏడు నెలల కాలంలో ఆరు నెలలు క్యాబినెట్ ఏర్పాటు, శాసనసభ సమావేశాలు, అధికారుల ఏర్పాటు, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ముగిసిందన్నారు. ఏడు నెలల్లో మిగిలిన ఒక్క నెలలో ఈ ప్రభుత్వం చాలా చేసిందన్నారు. అయినా తెలంగాణ రాష్ట్రాన్ని గత పది సంవత్సరాలు గొప్పగా పాలించామని గొప్పలు చెప్పే మాజీ సీఎం కేసీఆర్ కావచ్చు, ఆరడుగుల ఆజాను బాహుడు హరీ‌ష్‌రావు కావచ్చు, కేటీఆర్, ఇతరులు కావచ్చు రాష్ట్ర ప్రభుత్వంపై నెత్తిలో మెదడు ఉన్న ఎవరూ మాట్లాడని మాటలు వారు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బంగారు పల్లెంలో అధికారాన్ని అప్పగించామని ప్రగాల్భాలు పలికే కేసీఆర్, హరీష్, కేటీఆర్ గత పది సంవత్సరాల కాలంలో రూ.8లక్షల కోట్ల అప్పు చేశారని దీనికి ప్రతీ నెలకు ఈ ప్రభుత్వం రూ.5వేల కోట్ల మిత్తి కడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నాం. ఇప్పటికే మహిళలకు బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200ల యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. అధికారంలోని వచ్చి 7 నెలల కాలంలో ఇచ్చిన మాట ప్రకారం అంకిత భావంతో ఇంత చేస్తున్నా ప్రతిపక్షాలకు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఎంతో గొప్ప పరిపాలన చేశామని చెప్పుకునే గత ప్రభుత్వంలో ఉద్యోగులకు సరిగా వేతనాలు కూడా చెల్లించలేదని ఎద్దేవా చేశారు. నేను, నా పార్టీ, నేను చెప్పిందే వేదం అన్న అహాన్ని ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ వదలాలని అన్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు రాష్ట్ర సంపదను అప్పనంగా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని ఆరోపించారు. అలాంటి పరిస్థితులు లేకుండా మా ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా గాంధీ కుటుంబం ఇచ్చిన మాటను ఎట్టి పరిస్థితుల్లో నెరవేర్చుతుందన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో ప్రేమగా మాట్లాడాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు చేయవద్దని, ప్రజలతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేమతో మాట్లాడాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు ఇక నుంచి అధికారులకు రెండు దరఖాస్తులను ఇచ్చి ఒక దానిపై సంబంధిత అధికారితో దరఖాస్తు తీసుకున్నట్లు తారీఖుతో కూడిన సంతకం తీసుకోవాలన్నారు. ఇక నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు క్రమం తప్పకుండా రావడం జరుగుతుందని, ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షా కార్యక్రమాలను చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు.

రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

రాష్ట్ర రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గాంధీ కుటుంబం ఏదైనా హామీ ఇచ్చిందంటే ఏది ఏమైనా ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇచ్చిన హామీని నెరవేర్చుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని తెలంగాణ ఇచ్చే బాధ్యత నాది చెప్పి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన విధంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నా మన్నారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్నా కేసీఆర్ కుటుంబం రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో అకాల వర్షాలకు పంట నష్టపోతే ఏనాడైనా పంట నష్టపరిహారం రాలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకుందన్నారు. కాంగ్రెస్ హయాంలో మొదలు పెట్టిన ప్రాణహిత-చేవెళ్ల పనులను పూర్తి చేసి కామారెడ్డి సాగు నీటి తిప్పలను పరిష్కరించాలని, అందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులను వేగవంతం చేసి పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా కృషి చేయాలని మంత్రికి కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, జిల్లా వ్యవసాయాధికారిణీ భాగ్యలక్ష్మీ, డీఎఫ్‌వో నిఖిత, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టు వెలవెల

- గతేడు పొంగిపొర్లిన పోచారం ప్రాజెక్టు
- ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్న ప్రాజెక్టు
- ఇప్పటికే గడిచిపోయిన నెలన్నర వర్షాకాలం
- ఖరీఫ్ సాగుపై రైతుల అనుమానాలు


నాగిరెడ్డిపేట, జూలై 20: వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు అవుతున్నా ఇంత వరకు వాన దేవుడు కరుణించకపోగా, భారీ వర్షాలు కురవనందున పోచారం ప్రాజెక్టులోకి చుక్క నీరు రాలేదు. గత సంవత్సరం వర్షాకాలంలో ప్రారంభం నుంచే వర్షాలు బాగా కురిశాయి. గత జూలైలో భారీగా వర్షాలు కురవడంతో జూలై 21, 2023న పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి పొంగి పొర్లింది. దీంతో జూలై 22న ఖరీఫ్ పంట సాగు కోసం ఆయకట్టు భూములకు పోచారం ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. గత సంవత్సరం ఖరీఫ్, రబీ రెండు పంటలకు పోచారం ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు అందజేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు అవుతున్నా వర్షాలు కురవక పోవడంతో పోచారం ప్రాజెక్టులోకి ఇప్పటి వరకు చుక్క నీరు రాలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరింది. నీరు లేక ప్రాజెక్టు వెలవెలబోతోంది. ప్రాజెక్టులో ఎటు చూసినా ఖాళీ మైదానమే దర్శనమిస్తోంది. వరుణ దేవుడు ఎప్పటికీ కరుణిస్తాడో, ఎప్పుడు వర్షాలు కురుస్తాయోనని నిత్యం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

ప్రస్తుత వర్షాకాలలో ఇప్పటి వరకు సరైన వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టులతో పాటు, గ్రామాల్లోని చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. సకాలంలో వర్షాలు కురిసి ఉండి ఉంటే ప్రాజెక్టులు, చెరువులు, కుంటలన్నీ నీటితో నిండి కళకళలాడేవి. కానీ ఈ సారి ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షమైన కురవలేదు. ఇప్పటి వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. నిత్యం నల్లటి మేఘాలు ఆకాశంలో దర్శనమిస్తున్నా అవి రైతన్నలను మభ్యపెడుతున్నాయి తప్ప వర్షాలు కురిపించడం లేదు.

ఖరీఫ్ సాగుపై అనుమానాలు

ఇప్పటి వరకు సరైన వర్షాలు కురియక పోచారం ప్రాజెక్టులో నీరు రాకపోవడంతో ఈసారి ఖరీఫ్‌లో పంటలు పండుతాయో లేదో నన్న అనుమానాలను ఆయకట్టు రైతులు వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వర్షాలు పుష్కలంగా కురవడంతో చెరువులు, కుంటలు నిండటంతో జూలై మాసంలో ఆయకట్టు రైతులు చాలా వరకు వరి నాట్లు వేశారు. గత సంవత్సరం జూలై 21న పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో ఆయకట్టు భూములకు పంట సాగు కోసం జూలై 22న ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని సుమారు 17వేల ఎకరాలకుపైగా రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు వర్షాలు కురవక ప్రాజెక్టులోనూ, చెరువులు, కుంటల్లో నీరు రాకపోవడంతో వరి నాట్లు వేయక వరి నారు మళ్లలోని వరి నారు ముదురుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రైతులు బోరు బావుల వద్ద వరి నాట్లు వేసుకున్నారు. బోర్లు లేని రైతులు నాట్లు వేయక వర్షాల కోసం నిత్యం ఎదురు చూస్తున్నారు. పోచారం ఆయకట్టు భూములు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేశారు. పంట సాగు లేకపోవడంతో ఖాళీ భూములుగా దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు వర్షాలు కురుస్తాయో ఎప్పుడు తమ పంట పొలాలు పంటలతో కళకళలాడుతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు.



గతేడు జూలై 21, 2023న పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు (ఫైల్)



ప్రస్తుతం డెడ్ స్టోరేజీలో పోచారం ప్రాజెక్టు నీటి మట్టం

స్త్రీ మహాశక్తితో సమానం

హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న జె.శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, జూలై 20: స్త్రీలు మహాశక్తితో సమానమని హైకోర్టు న్యాయమూర్తి, కామారెడ్డి అడ్మినిస్ట్రేట్ జడ్జి జే.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కామారెడ్డిలోని కళాభారతిలో జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ, ఐసీడీఎస్, మహిళ సహాయక సంఘాలు, కళాశాల విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక మహిళ సంఘ సభ్యులు నిర్వహిస్తున్నది ఉద్యోగ బాధ్యతలు మాత్రమే కావని వారు చేసేది ఒక సామాజిక సేవ అని అన్నారు. స్త్రీ అంటే ఒక సామాన్యశక్తి కాదని మహాశక్తి అని చైతన్య వంతమైన మహిళ ఉంటే ఇల్లు ఆదర్శ వంతంగా ఉంటుందని, ఇల్లు ఆదర్శవంత మైనప్పుడే ప్రపంచానికి ఆదర్శంగా తయారవుతుందని అన్నారు. మహిళల సంక్షేమం కోసం గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధకచట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలను తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, న్యాయమూర్తులు లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, నాగరాణి, దీక్ష, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఘనంగా ఊర పండుగ

● నడ్డి ఊరు హనుమాన్ మందిరం నుంచి గ్రామ దేవతల ఊరేగింపు

● అలరించిన పోతురాజుల విన్యాసాలు





ఫలహార బండిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



గ్రామచావిడి వద్ద పోతురాజుల విన్యాసాలు

బోధన్‌రూరల్, జూలై 20: బోధన్ పట్టణంలో శనివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గత శుక్రవారం ఊర పండుగ కోసం ముడుపు వేసిన అనంతరం గ్రామస్థులు పట్టణ ఆచారాలు, సంప్రదాయాలను పాటించారు. శనివారం తెల్లవారుజాము నుండే ఊర పండుగ కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని నడి ఊరు హనుమాన్ మందిరం నుండి అన్ని గ్రామ దేవతలకు ఊరేగింపుగా వెళ్లి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈసందర్భంగా పోతురాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి పట్టణంలోని అన్ని కుల సంఘాల నాయకులు, సభ్యులు గ్రామాభివృద్ధి కమిటీ ఆదేశాలు పాటిస్తూ ఊర పండుగకు సహకరించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంట చల్లగా ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడి ఊరు హనుమాన్ మందిరం నుండి ఫలహార బండిని అన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊర పండుగ అనంతరం బండిని ప్రత్యేక పూజల అనంతరం గ్రామశివారులో వదలిపెట్టారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఊర పండుగ కార్యక్రమాన్ని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ నెల 12న గ్రామ నడిబొడ్డు చావిడి వద్ద ముడుపు వేయడం జరిగిందని, శనివారం ఊర పండుగను గ్రామ ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించడం జరిగిందన్నారు. ఊర పండుగకు సహకరించాలని అన్ని కులాల నాయకులు, ప్రజలకు, యువకులకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీనాయకులు సూర్యప్రకాష్, గుమ్ముల అశోక్, రుద్ర సత్యనారాయణ, కొంద్ర వెంకటి, బీర్కూర్ బుజ్జి, మాసుల శ్రీను, గుంత గంగాధర్, ఐదు తర్ఫల కుల సంఘాల నాయకులు, సభ్యులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

● పోలీసుల భారీ బందోబస్తు

ఊర పండుగ సందర్భంగా బోధన్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ వీరయ్య భారీ బందోబస్తు నిర్వహించారు. బోధన్‌లో నిర్వహించే ఊర పండుగ శనివారం ప్రశాంతంగా జరిగింది.

జీజీహెచ్‌లో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

● ఆసుపత్రి కారిడార్‌లో నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లిన వైనం

● మెట్‌పల్లిలో బాలుడిని గుర్తించిన పోలీసులు

పెద్దబజార్, జూలై 20: ఆసుపత్రి ఆవరణలో నిద్రిస్తున్న మూడేళ్ల బాలుడిని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేపింది. మాక్లూర్ మండలం మానిక్‌భండార్‌కు చెందిన సాయినాథ్ గర్భిణీ అయిన తన భార్య సాయ మ్మను డెలివరీ కోసం బుధ వారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. భార్య డెలివరీ వార్డులో ఉండగా.. శుక్రవారం రాత్రి తన మూడేళ్ల కుమారుడు అరుణ్‌ను వెంట తీసుకుని ఆసుప్రతి కారిడార్‌లో నిద్రించగా.. కొద్దిసేపటి తర్వాత చూడగా పక్కన తన కొడుకు లేకపోవడంతో ఆందోళనకు గురై ఆసుపత్రిలో ఉన్న పోలీసు సిబ్బందికి ఫిర్యాదుచేశాడు. ఆసుపత్రిలో, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో 1వ టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో పోలీసులు ఆసుపత్రికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి ఆ బాలుడిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి కేసు దర్యాప్తు చేపట్టారు.

● మెట్‌పల్లిలో బాలుడి గుర్తింపు.. పోలీసు అదుపులో ఇద్దరు నిందితులు

నిజామాబాద్ జీజీహెచ్‌లో కిడ్నాప్‌కు గురైన బాలుడు అరుణ్‌ను జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో పోలీసులు గుర్తించారు. వెంటనే బాలుడిని తమ ఆధీనంలో తీసుకుని ఆర్మూర్‌కు చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజనంలో రాజీ పడొద్దు

● డీఎల్‌పీవో శ్రీనివాస్

ధర్పల్లి, జూలై 20: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఏజెన్సీలు రాజీ పడవద్దని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. భోజన విషయంలో రాజీపడవద్దని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, నీటి సౌకర్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, పారిశుద్ధ్యంపై మండల పరిషత్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున కార్యదర్శులు స్థానికంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు గ్రామంలో పర్యటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఈవో సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'24న జీవిత బీమాపై స్పెషల్ డ్రైవ్'

పెద్దబజార్, జూలై20: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు గ్రామీణ తపాల జీవిత భీమాపై అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం ఈనెల 24న స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి తక్కువ ప్రీమియం అధిక బోనస్‌తో ఐదు రకాల జీవిత భీమా పాలసీలను అందిస్తోందని, 19 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యగల వ్యక్తులు ఈ బీమా తీసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. గరిష్ఠంగా 10లక్షల పాలసీని పొందవచ్చని, పాలసీదారు ప్రతీనెల, మూడునెలలు, ఆరునెలలు, సంవత్సరం వాయిదాలలో ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. యువకులు తీసుకుంటే ఎక్కువ లాభం పొందే అవకాశంఉందని పాలసీని ఆమోదించిన తేదీ నుంచి జీవితబీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణిస్తే సమ్ అస్యూర్డ్ మరియు బోనస్ నామినీకి అందించబడుతాయని తెలిపారు. పాలసీ మెచ్యూరిటీ సమయంలో పాలసీదారు జీవించి ఉంటే పాలసీదారునికి హామీ మొత్తం బోనస్ వస్తుందని, పాత ప్రీమియంతో పాలసీని కొనసాగించవచ్చని తెలిపారు.

కోటగిరిలో ముసురు వర్షం

కోటగిరి, జూలై20: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం ముసురుతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి రాత్రి వరకు అడపదడప చిరుజల్లులతో కూడిన వర్షానికి రహదారులన్ని చిత్తడిగా మారాయి. వాగులు, వంకల్లోకి స్వల్పంగా వర్షం నీరు వచ్చి చేరింది.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత

జక్రాన్‌పల్లి, జూలై20: మండలంలోని అర్గుల్‌గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉపాధ్యాయుడు తిరునగిరి ఆంజనేయవరప్రసాద్ స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు తన సొంతంగా వంద మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను కొనుగోలు చేసి అందజేశారు. మాజీసర్పంచ్ గోర్త పద్మరాజేందర్, మాజీఎంపీటీసీ హరిత చిన్నారెడ్డి, ఏఏపీసీఛైర్మన్ లక్ష్మీ, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల సమయాల్లో మార్పులు: ఎంఈవో

మోర్తాడ్, జూలై20: ప్రభుత్వఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్పు చేసినట్లు ఎంఈవో ఆంధ్రయ్య శనివారం తెలిపారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈనెల 22 నుంచి పాఠశాలలు నడపాలని ఎంఈవో కోరారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని ఆయన కోరారు.

నూతన భారతీయ చట్టాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్ లీగల్, జూలై 20: తెలంగాణ రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య ఉమ్మడి జిల్లాల పీపీలతో నూతన చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల పీపీలు పాల్గొన్నారు.

● అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

రహీముద్దీన్ నిజామాబాద్ జిల్లా, జి.రామకృష్ణ ఆర్మూర్ మండలం నుంచి ప్రథమశ్రేణి కోర్టు పోలీసువారి తరఫున క్రిమినల్ కేసులు వాదించడానికి వీరిని నియమించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ప్రాసిక్యూటర్‌లు సమ్మయ్య, బూసారపు రాజేష్, వసంత్, రాణి, శివరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జూలై20: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు టీటీడీసీ కోఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాటశాల ఆవరణలో శనివారం బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 19-40సంవత్సరాల వయసు కలిగిన వారికి తమ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 30రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు వచ్చే వారికి భోజన వసతి కల్పించి ఉదయం నుండి సాయంత్రం వరకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ సెంటర్ ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర దత్తసాయి ఆలయంలో ముగిసిన సప్తాహ కార్యక్రమం

మోస్రా, జూలై 20: మండల కేంద్రంలోని మోస్రా శ్రీ విఘ్నేశ్వర దత్తసాయి ఆలయంలో 14ఆదివారం రోజు నుండి ఏడు రోజుల పాటు సప్తాహ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా భగవత్ స్వరూప విగ్రహాలను ట్రాక్టర్‌లో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు నరేష్ మాట్లాడుతూ భక్తితో భజన చేసిన భజన మండలికి అభినందనలు తెలుపుతూ సన్మానించారు. అదే విధంగా ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా యజ్ఞం, సాయి సచ్చరిత్ర పారాయణం, గురు చరిత్ర పారాయణం, అఖండ సాయినామం, ఉదయం 5గంటలకు కాగడ హారతి, 6గంటలకు అభిషేకం, 8గంటలకు యజ్ఞం కార్యక్రమం, 10 గంటలకు సత్యనారాయణ వ్రతాలు, 12గంటలకు హారతి తర్వాత అన్నదానం కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని భక్తులను కోరారు.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

జక్రాన్‌పల్లి, జూలై 20: మండలంలోని బ్రహ్మణ్‌పల్లిలో గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపి శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని అంత్యక్రియాల కోసం ఎంపీడీవో సతీష్‌కుమార్ రూ.10వేల కుటుంబ సభ్యులకు అందజేశారు. అంత్యక్రియాల్లో ఎంపీడీవో సతీష్‌కుమార్, పంచాయతీ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం, మాజీ సర్పంచ్ లత దేవరాజ్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌లు ఉన్నారు.

చినుకు పడితే.. చిత్తడే!

● అధ్వాన్నంగా ఖానాపూర్ రోడ్డు ● కోట్లు ఖర్చుచేసినా నిష్ఫలం ● సగం సగం పనులు చేసిన గుత్తేదారు
● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న జనం ● నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ● రైసుమిల్లులకు వెళ్తున్న భారీ వాహనాలు


నిజామాబాద్-ఖానాపూర్ రోడ్డు ఇదే..


ఖానాపూర్ గ్రామంలో గుంతలమయమైన రోడ్డు

నిజామాబాద్ రూరల్, జూలై, 20: జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్లే మార్గం అది. ఆ గ్రామం నగరంలోని 1వ డివిజన్ పరిధి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. కాలూరు రోడ్డు నుంచి మొదలు భాగ్యనగర్ కాలనీ, ఖానాపూర్ మీదుగా జన్నేపల్లి రోడ్డును కలుపుతుంది. నవీపేట, బాసరకు వెళ్లేవారు ఈమార్గం గుండానే వెళతారు. నవీపేటలోని మేకల సంతకు వెళ్లేవారు వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయి.ఈరోడ్డు సీసీ రోడ్డు కోసం గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల మంజూరుచేసింది. రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు పనులకు డబ్బులు సరిపోకపోవడంతో గుత్తేదారు పనులు సగంసగం చేశారు. దాంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిన్నపాటి వర్షానికే ఖానాపూర్ చిత్తడిగా మారింది. గత రెండు రోజులుగా సన్నగా కురుస్తున్న వర్షానికే రోడ్డుపక్కల నీరు నిలిచి గుంతలమయంగా మారింది. ద్విచక్రవాహనదారులకు, ఆటోలకు, సైకిళ్లమీద వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మార్గం గుండా భారీ వాహనాలు వెళ్లడం వల్ల రోడ్డు పాడవుతోంది. కాంగ్రెస్ హయాంలోనైనా ఈ రోడ్డుకు మోక్షం కలగాలని ఖానాపూర్, భాగ్యనగర్‌వాసులు కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



ఖానాపూర్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. మహిళలు ముఖ్యంగా గర్భిణులు ఈ మార్గం గుండా రావాలంటే చాలా ఇబ్బందిగా మారింది. వాహనదారులు సైతం గుంతల్లో పడి ఎంతోమంది గాయాలపాలయ్యారు. ఎన్ని కల సమయంలో గత ప్రభుత్వం తూతూ మంత్రంగా పనులు చేసింది. సగం పనులు మధ్యలోనే వదిలివేశారు. నిత్యం వందల మంది వెళ్లే ఈ రోడ్డును నాణ్యతతో వేయాలి.

-సాలుగారి మోహన్, ఖానాపూర్‌వాసి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చాం



ఖానాపూర్ రోడ్డు అద్వాన్నంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం పాడవుతోంది. గత ప్రభుత్వ హయాంలో గుత్తేదారు పనులు సగంలో వదిలివేశారు. డబ్బులు సరిపోకపోవడంతో పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. రోడ్డు దుస్థితి గురించి ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డికి వివరించాం. త్వరలోనే నిదులు మంజూరుచేసి పనులు పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

- కొర్వ గంగాధర్, మాజీ సర్పంచ్, ఖానాపూర్

ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది బదిలీ

సిరికొండ, జూలై 20: సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే ఎంపీవో లక్ష్మీప్రసాద్ తోపాటు మరో ముగ్గురు సిబ్బంది బదిలీ అయ్యారు. గురువారం జరిగిన కౌన్సిలింగ్‌లో ఎంపీవో లక్ష్మీప్రసాద్ నందిపేట్‌కు బదిలీ కాగా, సీనియర్ సహాయకులు నారాయణ జిల్లా పరిషత్‌కు,జూనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ జిల్లా పరిషత్‌కు బదిలీ అయ్యారు. టైపిస్టు చంద్రశేఖర్ భీమ్‌గల్‌కు బదిలీ అయ్యారు.సిరికొండకు ఎంపీవోగా రుద్రూర్ నుంచి తారచంద్‌కు పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేయలేదని సమాచారం. మూడు పోస్టులు ఖాళీగా ఉండబోతున్నాయనేది అధికారులు చెపుతున్నా సమాచారం. ఉన్న ఒక్క అటెండర్ మోహినొద్దిన్‌ను న్యావనంది హైస్కూల్‌కు బదిలీ చేయగా, పెద్దవాల్గోట్ హైస్కూల్లో పని చేస్తున్న నిసార్‌ను సిరికొండ మండల పరిషత్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

పొతంగల్‌లో గ్రామసభ

కోటగిరి,జూలై20: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఆదాయ, వ్యయాలు, పారిశుధ్య పనులు, తాగునీటి సమస్యలపై తీసుకున్న చర్యలను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాల వల్ల రోడ్డు చిత్తడిగా మారుతున్నాయని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతీ, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బడాపహాడ్ రోడ్డుపై వర్షపు నీరు


రోడ్డుపైన నిలిచిన వర్షపు నీరు

మోస్రా,జూలై20: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలోని మోస్రా నుంచి బడాపహాడ్ వెళ్లే బైపాస్ రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులకు గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఇందుకు కారణం అధికారులు రోడ్డు వేసినప్పుడు సరైన ప్రణాళిక లేక ఈ సమస్య ఏర్పడిందని ఈ బైపాస్ మీదుగా బడాపహాడ్ దర్శనానికి వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయని ఇలాగే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని ఏర్పడిన గుంతలు పూడ్చాలని నీరుపోకుండా అడ్డుగా వేసిన మొరం తొలగించాలని మాజీ సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్థులు కోరుతున్నారు.

బీడీకార్మికుల జీవనభృతి పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు, బీడీకార్మికులు

ఆర్మూర్‌టౌన్, జూలై20: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీకార్మికుల జీవనభృతిని పెంచాలని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న అన్నారు. శనివారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మహిళలు బీడీ చుట్టే కార్మికులు, ప్యాకింగ్ కార్మికులు, చాటన్‌కార్మికులు బట్టీవాల, వాచ్‌మెన్, ఆఫీస్ వర్కర్‌లు ఇతరులు బీడీ పారిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని ఆయన అన్నారు. జీవనోపాధి కొనసాగడానికి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతిని రూ.4016పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు అర్వింద్, తుప్పటి శ్రీనివాస్; నజీర్, పద్మ, సునీత, లక్ష్మీ, మమత, బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జోరలో బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి


గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్త

భీమ్‌గల్ రూరల్, జూలై 20: భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామ శివారులోని కప్పలవాగు నుంచి శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరికొంత మంది వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాటలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కర్నె మహేందర్ బెజ్జోర గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త భాస్కర్ కొట్టుకున్నట్లు సమాచారం. తో పులాటలో ఇరువురికి గాయాలయ్యాయి. కర్నె మహేందర్ తలకు గాయం కావడంతో రక్తస్రావం అయ్యింది.. భాస్కర్ కు కూడా కుడి చేతికి గాయాలు అయ్యాలనాన్నరు.ఇక్కడే ఉన్న మాజీ బీఆర్ఎస్ ఎంపీపీ ఆర్మూర్‌మహేష్ పోలీసులకు సమాచారం అందించాడు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో దాడి జరగడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. వాగులో నుంచి బయటకు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం బీఆర్ఎస్ కార్యకర్త కర్నె మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి బెజ్జోర గ్రామ శివారులోని కప్పల వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం . దాడి జరిగిన నేపధ్యంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

మోస్రా జడ్పీహెచ్ఎస్‌లో పేరెంట్స్ మీటింగ్

మోస్రా,జూలై20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల చదువు పట్ల శ్రద్ద చదువు కొరకు కేటాయించవలసిన సమయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంత శ్రద్ధగా ఉన్న ఇంటి వద్ద కూడా శ్రద్ధతో చదివేల సమయం ఇవ్వాలని పిల్లలకు చదువు ఒకటి కాకుండా మానసిక ఒత్తిడికి లోనవకుండా ఆరోగ్యం పట్ల, శరీరం దృఢంగా ఉండాలంటే ఆటల కొరకు కొంత సమయం ఇస్తూ ఉన్నాం అదే విధంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సంగీత, పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, స్వరూప, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 20: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు శనివారం 18వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 48 మంది విద్యార్థులకు గాను 44మంది హాజర య్యారని, 4గురు గైర్హాజరయ్యరని చంద్ర శేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 80మంది విద్యార్థులకు గాను 76 పరీక్షకు హాజరయ్యారని, 4గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

నిజామాబాద్ రూరల్, జూలై, 20: రూరల్ మండలం చక్రదర్‌నగర్ తండాకు చెందిన బదావత్ రాజు (17) అనే యువకుడు తప్పిపోయినట్లు యువకుడి తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. బాదావత్ రాజు పుట్టుకతో మూగ, చెవిటి వైకల్యం కలవాడు. రెండు వారాల క్రితం ఇంటినుంచి బయటకువెళ్లిన రాజు తిరిగి రాలేదని తెలిపారు. తెలిసినవారిని విచారించినా సమాచారం లేకపోవడంతో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. గతంలో కూడా రాజు ఒకసారి ఇంటి నుంచి తప్పిపోయి హైదరాబాద్‌లో దొరికినట్లు తెలిపారు. రాజు ఆచూకీ తెలిసినవారు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

ధర్మారంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట

● చిన్నారులకు అక్షరాస్యత చేయించిన సీడీపీవో

డిచ్‌పల్లి,జూలై 20: ధర్మారం(బి) లో శనివారం అమ్మమాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో డిచ్‌పల్లి ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత,సూపర్‌వైసర్ శ్రీప్రియ తో కలిసి చిన్నారులకు అక్షర్యా భ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. అంగన్ వాడి కేంద్రంలో సామూహిక అక్షరభ్యాసం చేయడం వల్ల చిన్నారుల్లో విద్యాపట్ల శ్రద్ధ పెరుగుతుందని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైసర్ శ్రీప్రియ, అంగన్‌వాడీ టీచర్ ఎడవల్లిజ్యోతి సోమ్‌నాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఘన్‌పూర్ చెరువుకు వరద

డిచ్‌పల్లి,జూలై 20: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఘన్‌పూర్ రాజేశ్వర చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నార. ఖరీఫ్ సీజన్‌లో గత వారం రోజులుగా ఆశా జనకంగా వర్షాలు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.చెరువులో వరద నీరు చేరడంతో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

వర్షం నీటిలో విద్యార్థుల ఇబ్బందులు



వర్షం నీటిలో విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూలై 20: నగరంలోని హమాల్‌వాడిలో గల దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వర్షం నీటిలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎడ తెరపి లేని వర్షం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా పీడీఎస్‌యు నాయకులు పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ దారుగల్లి ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని వర్షాకాలం వచ్చిందంటే చాలు పాఠశాల ప్రాంగణంలో వర్షంనీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కావున సమస్యను పరిష్కరించాలని కోరారు. బాత్‌రూమ్‌లు కూడా సక్రమంగా లేవని స్కూల్ బిల్డింగ్ సైతం పురాతనంగా మారిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, భరత్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి'


విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న మేనేజర్ మల్లేష్

సిరికొండ జులై 20 : లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని బ్యాంక్ ఆఫ్ బరోడ మేనేజర్ బూస మల్లేష్‌యాదవ్ విద్యార్థులను కోరారు. బ్యాంక్ ఆఫ్ బరోడ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తూంపల్లి గ్రామంలో సుమారు 300 మంది హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను శనివారం మేనేజర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే గోల్ పెట్టుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు. పదోతరగతిలో పదికి పది గ్రేడింగ్ పాయింట్లను సాధించాలనే పట్టుదలతో చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని పరీక్షలకు ప్రిపేర్ కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఉగులోత్ నరేందర్, క్యాషియర్ శ్రావన్‌కుమార్, నూనెరవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



ఫకీరాబాద్‌లో నిరసన తెలుపుతున్న లిఫ్టు కార్మికులు

నవీపేట, జూలై 20 : పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ శనివారం మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ఆలీసాగర్, గుత్పఎత్తిపోతల పథకం కార్మికులు నిరసన చేపట్టారు. గత నాలుగు మాసాలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని వెంటనే వేతనాలు చెల్లించే విధంగా అధికారులు తగినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వర్షంలో తడుస్తూ తమ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో గణేష్, సందీప్, నరేష్, తదితరులున్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ధర్నా


వినతిపత్రం సమర్పిస్తున్న ముదిరాజ్‌లు

కోటగిరి, జూలై 20 : కోటగిరి, పొతంగల్ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శనివారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు, చెరువులు, కుంటలపై ముదిరాజ్, బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వివిధ పథకాల కింద 75శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ సాయిలు, ఉత్తం, రాములు, సుదర్శన్, గంగాధర్, ఉదయ్ భాస్కర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు'


సూచనలిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మోస్రా, జూలై 20 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల చదువు పట్ల శ్రద్ద కోసం, కేటాయించవలసిన సమయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంత శ్రద్దగా ఉన్న ఇంటి వద్ద కూడా శ్రద్దతో చదివేల సమయం ఇవ్వాలని పిల్లలకు చదువు ఒకటి కాకుండా మానసిక ఒత్తిడికి లోనవకుండా ఆరోగ్యం పట్ల, శరీరం దృఢంగా ఉండాలంటే ఆటల కొరకు కొంత సమయం ఇస్తూ ఉన్నాం అదే విధంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ విధంగా జరిగే పాఠశాలలో తల్లిదండ్రుల కార్యక్రమంలో ప్రతి విద్యార్థి నుంచి ఇంటి పెద్ద ఒకరు రావాలని తగు సూచనలు ఇస్తూ తెలుసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మత్తు పదార్థాలను అరికట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 20 : జిల్లాలో గంజాయి మత్తు పదార్థాలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో ఉన్న మూడుకల్లు డిపోల్లో గీత కార్మికులకు సిట్టింగ్ జీతం పేరుతో చెట్ల నుంచి కల్లు తీయకుండా ఆల్ప్రోజోలం కలిపి తయారు చేస్తున్నారని అన్నారు. కల్తీ కల్లు ఘనత కాంట్రాక్టర్లదేనని అన్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం డిపోకు ఈత, తాటి చెట్లు కేటాయించారో ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరం ఎక్సైజ్ అధికారులపై ఉందన్నారు. నిజామాబా ద్ నగరంలో అధికారులు ఉన్నప్పటికీ ప్రమాదకరమైన ఆల్ప్రోజోలం మత్తు పదార్థాలను కలిపి కల్లుకు బానిస చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎక్సై జ్ అధికారులు స్పందించి కల్తీకల్లుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓమయ్య రఘురాం, నర్సింగ్‌రా వు, సురేష్, గంగాధర్, ఆనంద్, భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు


మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

వేల్పూర్, జూలై20: ప్రస్తుతం వర్షాకాలంలో లభించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్‌చంద్ర ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ కలర, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వ్యాధుల నిర్మూలనకు వైద్య శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు కలిసి కృషి చేయాలన్నారు. కలర, డయేరియా వచ్చిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. గ్రామాలలో ఈ వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటిస్తూ ఇంటి చుట్టు మురికి నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జూలై 20: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు కొండపై చేరుకొని కొండపై చుట్టు భక్తులు కలిసి ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్లాటును కాజేసిన వ్యక్తిపై కేసునమోదు

కామారెడ్డి టౌన్, జూలై 20 : పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న 200 గజాల ప్లాటును కాజేసిన మారం శ్రీనివాస్‌తో పాటు అతనికి సహకరించిన ఆరేటి గంగాధర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2002లో గాంధీనగర్‌లో కలిమెళ్ల రాజయ్య అనే వ్యక్తి 200 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఆ తర్వాత అత ను అనారోగ్య కారణం వల్ల చనిపోయాడు. 2015వ సంవత్సరంలో కామారెడ్డి వీక్లిమార్కెట్‌కు చెందిన మారం శ్రీనివాస్ అనే వ్యక్తి, ఆ ప్లాట్‌పైన కన్నువేసి ఎలాగైనా ఆప్లాటును తన సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆ ప్లాట్ ఓనర్ అయిన రాజయ్య కుమారుడు కలిమెలా మహేందర్ ఉన్నట్లుగా తెలుసుకున్నాడు. రాజయ్య కుటుంబసభ్యులకు తెలియకుండా వీక్లీ మార్కెట్‌కి చెందిన ఆరేటి గంగాధర్ అనే వ్యక్తిని రాజయ్యకొడుకు మహేందర్‌లాగా చూయించి మహేందర్ తండ్రి రాజయ్య చనిపోయిన తర్వాత ఆ ప్లాట్‌కి మహేందర్ వారసత్వంగా యజమాని అని తప్పుడు డాక్యుమెంట్ చూపించి, మహేందర్ ప్లేస్‌లో ఆరేటి గంగాధర్‌ను సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు తీసుకెళ్లి ఆ ప్లాటును మారం శ్రీనివాస్ దొంగతనంగా తన పేరు మీద మార్చుకున్నాడని తెలిపారు. ఈ తదుపరి ఆ ప్లాట్‌ను కామారెడ్డి పట్టణంలోనే ఉన్న మరో వ్యక్తికి అమ్మేశాడని తెలిపారు. ఈ విషయం తెలియని కలిమెల మహేందర్ తన తండ్రి కొనుగోలు చేసిన ప్లాట్ వద్దకు వచ్చి చూడగా అది వేరే వారి యొక్క స్వాధీనంలో ఉండడాన్ని గమనించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. కేసు నమోదుచేసి విచారణ జరిపి బాధ్యులైన శ్రీనివాస్, గంగాధర్‌లను అరెస్టుచేసి శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

శ్మశానవాటికలో నిరుపయోగంగా స్నానపుగదులు


స్నానపు గదుల గోడల పైనుంచి పడిపోయిన రేకులు

డొంకేశ్వర్, జూలై 20 : డొంకేశ్వర్ మండలం గంగాసరం గ్రామంలో శ్మశాన వాటిక స్నానపు గదులు నిరుపయోగంగా మారాయి. గత ఆరేళ్ళ క్రితం గదులు గోడలపైన రేకులు వేసి గదులను నిర్మించినా రెండేళ్ళ క్రితం వర్షం బలమైన ఈదురుగాలులు వీయడంతో గోడలపై వేసిన రేకులు చిందవందరగా ఎక్కడి కక్కడ పడిపోయాయి. అప్పటి నుంచి వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో అక్కడికి అంత్యక్రియలకు వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ళ నుంచి అధికారులకు సమస్యపై విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిని మరమ్మతులు చేయించాలని గ్రామస్థులను కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

నవీపేట,జూలై20: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, సంగెం శ్రీనివాస్, భగవాన్, బాలరాజు గౌడ్, ఎస్కే బాబు, మానికేశ్వర్ రావు, చల్లా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు పాటించాలి

రాజంపేట, జూలై 20 : విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు ఉపాధ్యాయులు తప్పకుండా పాటించాలని డీఈవో రాజు తెలిపారు. శనివారం రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చదువుల పంట యాప్‌ను ఉపయోగించాలని, ఇంటి దగ్గర పిల్లల కోసం సమయం కేటాయించి వారి భవిష్యత్తుకు తోడ్పడాలని అన్నారు. తల్లిదండ్రుల సూచనలు ఉపాధ్యాయులు తప్పకుండా స్వీకరించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ప్రతి ఆటలో ముందుండాలని విద్యార్థిని, విద్యార్థులకు ఆటదుస్తులు అందజేయడం జరిగిందన్నారు. గ్రామపెద్దల సహకారంతో విద్యార్థులకు ఆటదుస్తులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ఏఎంవో వేణుగోపాల్ శర్మ, సీఎంవో కృష్ణచైతన్య, లత, మాజీ ఎంపీటీసీ రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పలు అంశాలపై చర్చించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రతపై మాట్లాడారు. అటెండర్, స్కావెంజర్‌లు లేకపోవడం వల్ల తమ పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులతో పేర్కొన్నారు.



విద్యార్థులకు దుస్తులను అందిస్తున్న అధికారి

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల్లో శనివారం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించారు. ఆయా మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి, పలు విషయాలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన, మౌలిక సదుపాయాలు తదితర వాటిపై చర్చించారు. విద్యార్థుల చదువు, ఏవైనా సమస్యలున్నాయా అని ఉపాధ్యాయులు అడిగి తెలుసుకుని, సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాంచందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● డీఈవో రాజు

పెద్దకొడప్‌గల్: పాఠశాల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర తప్పని సరిగా ఉండాలని పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కమల మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ విషయంలో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలో బోధించిన పాఠాలను ఇంటి వద్ద విద్యార్థులు చదివేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. దీంతో పాటుగానే విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారనే పరిశీలించాలని సూచించారు. పోషకులు ఇంటింట చదువుల పంట యాప్‌ను వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతు పాఠశాల నిర్వహణలో తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాజమణి, ఉపాధ్యాయ బృందం నాగనాథ్, రాజు, సుదర్శన్ రెడ్డి, కిషోర్, ఉమాదేవి, రవికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంది

- రుణమాఫీతో అండగా నిలిచాం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ
- దోమకొండలో రైతు సంబరాలు



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న షబ్బీర్‌అలీ

దోమకొండ, జూలై 20: రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం దోమకొండలో రైతు సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాతబస్టాండ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి లబ్ధిచేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తానే అప్పటి విద్యుత్‌శాఖమంత్రిగా సబ్‌స్టేషన్‌ల మంజూరు చేసి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. దోమకొండలో నెలలోపు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి తీగల తిర్మల్‌గౌడ్, పార్టీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు పోగుల కవిత, నాగరాజ్‌రెడ్డి, పిరంగి రాజేశ్వర్, తాటిపల్లి శ్రీకాంత్, స్వామి, బాపురెడ్డి, రామస్వామిగౌడ్, ఐరేని నర్సయ్య, నర్సారెడ్డి, మారుతి, పన్యాల ముత్యంరెడ్డి, నల్లపు అంజలి, నిమ్మ శంకర్, శ్రీనివాస్, షమ్మీ, నయీం, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, సంతోష్, సంజీవ్, మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈతమొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



ఈతమొక్కలు నాటుతున్న అధికారులు

గాంధారి, జూలై 20 : మండల కేంద్రంలో శనివారం ఎక్సైజ్ సీఐ షాకిర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో వనమహోత్సవం సందర్భంగా ఈతమొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి కల్లు ఇవ్వాలంటే ఈతచెట్లను గౌడ కులస్తులు పెంచాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా గాంధారి గౌడ కులస్తులతో కలిసి ఈతమొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రవి, స్రవంతి, గౌడ కులస్తులు అంజాగౌడ్, రవిగౌడ్, నారాగౌడ్, సాయాగౌడ్ ఉన్నారు.

బాన్సువాడలో ముసురు....

బాన్సువాడటౌన్ , జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బాన్సువాడ పట్టణంలో శనివారం ఉదయం నుంచి ముసురేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు



కంపోస్ట్ షెడ్లను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

సదాశివనగర్, జూలై 20 : గ్రామాలలో పరిశుభ్రతా పనులను పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పరిశుభ్రత పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురికికాలువలు తీయడం, కంపోస్ట్‌షెడ్, దోమల మందు పిచికారి, ఆయిల్‌బాల్స్ తదితర పనులు పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాలను శుభ్రంగా ఉంచే విధంగా చూడాలని కార్యదర్శులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సురేందర్, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

నాగిరెడ్డిపేట, జూలై 20 : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన ఎనిమిది మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో పర్బన్న తెలిపారు. మండలంలోని బొల్లారం పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ లింగంపేట మండలం కోమట్‌పల్లికి, మాల్తుమ్మెద పంచాయతీ కార్యదర్శి నర్సింలు, మద్నూర్ మండలం పెద్దపడుకు, మెల్లకుంట పంచాయతీ కార్యదర్శి సవాయి మద్నూర్ మండలం డోంగ్లీకి, పల్లె బోగడ తండా పంచాయతీ కార్యదర్శి సునంద ఎల్లారెడ్డి మండలం సబ్దల్‌పూర్‌కు, జప్తి జానకంపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్‌కు, అచ్చయపల్లి పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీ ఎల్లారెడ్డి మండలం మత్‌మాల్‌కు, రాఘవపల్లి పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామ పంచాయతీకి, ధర్మారెడ్డి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మెదక్ జిల్లాకు బదిలీ అయినట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ దశరథ్ కామారెడ్డి జిల్లా పరిషత్‌కు అటెండర్ మణెమ్మ, ఎల్లారెడ్డి మండల పరిషత్‌కు బదిలీ అయినట్లు ఎంపీడీవో తెలిపారు.

సీసీ కెమెరాలతో రక్షణ

● సీఐ సంతోష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

గాంధారి, జూలై 20 : మండల కేంద్రంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ ఆంజనేయులు సీసీ కెమెరాలపై వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్రతి దుకాణ సముదాయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, మాజీసర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ రాజులు, సంతోష్, ముస్తఫ్, సాయిబాబా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ

కామారెడ్డి రూరల్, జూలై 20 : అర్హులైన ప్రతిఒక రైతుకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని, సాంకేతిక కారణాల వల్ల కొందరి రైతుల పేర్లు వెల్లడి కాలేదని శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ తెలంగాణ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం మండల, జిల్లా స్థాయిలో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కౌంటర్లను ఏర్పాటు చేసిందన్నారు.

'షీలాదీక్షిత్ సేవలు గొప్పవి'

పెద్దకొడప్‌గల్, జూలై 20: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ చేసిన సేవలు అమోఘమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ కొనియాడారు. శనివారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో షీలా దీక్షిత్ చిత్రపటానికి జుక్కల్ ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీకి షీలాదీక్షిత్ చేసిన సేవలు చాలా విలువైనవని తెలిపారు.

ఉద్యోగుల బదిలీ

పెద్దకొడప్‌గల్, జూలై 20 : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సాధారణ ఉద్యోగుల బదిలీలలో భాగంగా పెద్ద కొడప్‌గల్ మండలం నుంచి పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే విఠల్ బాన్సువాడ మండలానికి బదిలీ అయ్యారు. దీంతో పాటుగానే పోచారం తండా పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రాము పిట్లం మండలానికి బదిలీ అయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కామారెడ్డిటౌన్, జూలై 20 : కామారెడ్డి నియోజకవర్గంలోని 35 మందికి శనివారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 35 మందికి మొదటివిడుతగా చెక్కులు వచ్చాయని తెలిపారు. నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, సీఎం సహాయనిధి నుంచి డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఇకపై వచ్చే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలాల వారిగా వచ్చి మండల కేంద్రాల్లోనే అందిస్తామని తెలిపారు.

బాధితుడికి కృత్రిమ కాలు అమరిక



బాధితుడితో సభ్యులు

బాన్సువాడటౌన్ , జూలై 20 : గత కొన్ని నెలల క్రితం బాన్సువాడ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో నసురుల్లాబాద్‌కు చెందిన బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు గంపల సాయికుమార్ కాళ్లను కోల్పోయాడు. బాన్సువాడ బీజేపీ నియోజకవర్గ నాయకులు గార్లే శ్రీనివాస్ ఇచ్చిన మాట ప్రకారం లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారి సహకారంతో బాధితుడికి కృత్రిమ కాళ్లను అమర్చారు. అంతేకాకుండా సాయికుమార్ పిల్లల చదువులకు అయ్యేఖర్చును కూడా తామే భరిస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ చిదురసాయిలు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

టీఎన్జీవోల సభ్యత్వ నమోదు

బాన్సువాడ టౌన్, జూలై 20 : బాన్సువాడ పట్టణంలో శనివారం టీఎన్జీవో సభ్యులు సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులకు టీఎన్జీవో అధ్యక్షుడు వెంకట్ సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి అనిల్, కోశాధికారి తుల శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

రాజంపేటలో సోషల్ ఆడిట్

రాజంపేట, జూలై 20 : రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ సోషల్ ఆడిట్ ప్రజావేదికను అడిషనల్ డీఆర్‌డీఓ వామన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాలకు సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశం, ఎంపీఓ రఘురాం, ఏపీఓ నక్కుభాయి,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ స్టడీసర్కిల్ ద్వారా ఉచిత మాక్ టెస్ట్‌లు

కామారెడ్డిరూరల్, జూలై 20 : తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ స్టడీసర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ ద్వారా ఉచిత టీజీపీఎస్సీ గ్రూప్-2 పూర్తి మ్యాక్‌టెస్టులు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి.దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 30 జూలై 2024 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'సోయాపంటల్లో తెల్లదోమను అరికట్టాలి'

సదాశివనగర్, జూలై 20 : రైతులు సోయా పంటలో వ్యాప్తి చెందుతున్న తెల్లదోమను అరికట్టకపోతే నష్టం వాటిల్లుతుందని ఏవో ప్రజాపతి తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మాజివాడిలో సోయా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల దోమ వ్యాపించడం వల్ల సోయాపంట పసుపురంగుగా మారి ఎదుగుదలతో పాటు పూత ఖాతా నిలుపుదల జరుగుతుందన్నారు. తెల్లదోమ నివారణ కోసం పిచికారి చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

గాంధారి, జూలై 20 : మాధవపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 2.6 సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో తల్లులకు అంగన్‌వాడీ సేవలు, అంగన్‌వాడీ ఆటపాటల ద్వారా విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతీ, టీచర్‌లు సువర్ణ, జయశ్రీ, సునీతలు హాజరయ్యారు.

'పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలి'

బీర్కూర్, జూలై 20 : అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల వయసు నుంచి తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని టీచర్లు తల్లులకు సూచించారు.వారి పేర్లను నమోదు చేసుకుని ఐదుసంవత్సరాలు వచ్చేంత వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చదువు చెబుతారన్నారు. అలాగే పిల్లలకు ఆడుతూ పాడుతూ విద్య నేర్పించి, పౌష్టికాహారం అందిస్తామని తల్లులకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రారం గ్రామ పంచాయతీ కోసం ప్రతిపాదనలు

నాగిరెడ్డిపేట, జూలై 20 : మండలంలోని ఎర్రారం గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు శని వారం ఎంపీడీవో పర్బన్న తెలిపారు. ప్రస్తుతం ఎర్రారం గ్రామం జలాల్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. ఎర్రారం గ్రామ జనాభా 572 ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 500 జనాభా కలిగిన గ్రామాలకు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఎర్రారం గ్రామ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటుకు నోచుకోలేదు. దీంతో ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎర్రారం గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేయ గా, కలెక్టర్ అశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఎంపీడీవో పర్బన్న తెలిపారు.

వర్షపునీరు నిలువకుండా చూడాలి

●మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి



అశోక్‌నగర్‌లో వర్షపునీటి సమస్యలను చైర్‌పర్సన్‌కు వివరిస్తున్న కౌన్సిలర్‌లు

కామారెడ్డిటౌన్, జూలై 20 : కామారెడ్డి పట్టణంలో వర్షపునీరు నిల్వకుండా చూడాలని సిబ్బందిని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని అశోక్‌నగర్ మెయిన్‌రోడ్డు, 17, 40, 15 వార్డులలో ఉన్న డ్రైనేజీ క్లీనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే 20 మంది కార్మికులతో రోడ్లను, మురికి కాలువలను శుభ్రం చేయించేందుకు మాస్‌క్లీనింగ్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. ఏ వార్డులోనైనా వర్షపు నీరుతో ప్రజలు ఇబ్బందులు పడితే వెంటనే స్థానికంగా ఉంటే జవాన్‌లు సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్‌లు భాస్కర్‌గౌడ్, వంశీ, వనితారామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



కిష్టాపూర్‌లో పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న నాయకులు

బీర్కూర్, జూలై 20 : మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో అంగన్ వాడీ కేంద్రం పిల్లలకు శనివారం బీజేపీ నాయకులు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. బీజేపీ కిష్టాపూర్ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను బీజేపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామశక్తి కేంద్రం ఇన్‌చార్జి లింగపురం రవి, బీర్కూర్ మండల బీజేపీ అధ్యక్షుడు నాగేళ్ల సాయి కిరణ్, మండల యువమోర్చా అధ్యక్షుడు వినేష్, బీజేపీ నాయకులు సహదేవ్, సాయిరెడ్డి పటేల్, రాజు, నవీన్, సందీప్, నాని పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బిచ్కుంద, జూలై 20 : బాన్సువాడకు చెందిన గాండ్లసాయిలు ఈనెల 5న మండలంలోని ఖద్గావ్ గ్రామానికి వచ్చాడు. ఈనెల 10న బయటకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆయన తల్లి గాండ్ల అంజవ్వ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్, జూలై 20 : మండలంలోని వడ్లం, కాస్లాబాద్ గ్రామాలలో గల పాఠశాలల్లో శనివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం పోరాటం చేసేది పీఆర్‌టీయూ సంఘమే అని గుర్తుచేశారు. తెలంగాణ వ్యాప్తంగా అత్యధికంగా ఉపాధ్యాయులు సభ్యులుగా కలిగి ఉన్న సంఘం పీఆర్‌టీయూ అని తెలిపారు. గతంలో కూడా తెలంగాణ వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు తీర్చడంలో పీఆర్‌టీయూ శాఖ ముందు ఉన్నదని తెలిపారు. రానున్న రోజులలో కూడా ఉపాధ్యాయుల సమస్యల తరపున పీఆర్‌టీయూ పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్‌సింగ్, కార్యదర్శి బస్వరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం



పురస్కారం అందుకుంటున్న బాలు

కామారెడ్డి రూరల్, జూలై 20 : ఐవీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ రక్తదాతలకు రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ చేతుల మీదుగా పురస్కారాలను అందజేసి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ముందు కూడా ఇలాంటి సేవలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుట్ల అనిల్, జమీల్, షైమద్, గంప ప్రసాద్, ఎర్రం చంద్రశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్, సాయి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డార్లింగ్
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	డార్లింగ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

